సంపుటి :02 సంచిక :69 పేజీలు :01
వెల ₹5
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
ఆదివారం 27, ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రతలు
కనిష్ఠం : 26
గరిష్ఠం : 36



# తెలంగాణకు నెం.1 విలన్ కాంగ్రెస్సే

- తెలంగాణకు నాడు, నేడు ఏనాడైనా విలన్ కాంగ్రెస్
- మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. ఆపటం ఎవరి తరం కాదు
- పోలీసులకు చెప్తున్నా.. డైరీలో రాసుకోండి మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- పోలీసులకు రాజకీయాలు ఎందుకు
- కార్యకర్తలకు బీఆర్ఎస్ లీగల్ అండగా ఉంటుంది
- ఇప్పటినుంచి నేను బయటికి వస్తా
- 20 నుంచి 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని స్వయంగా కాంట్రాక్టర్లే చెప్పారు
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చం
- కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఊచకోత కోస్తుంది
- బలం ఉన్నదని చంపుకుంటూ పోవుడు ప్రజాస్వామ్యం కాదు
- ఆపరేషన్ కగార్ ను వెంటనే ఆపాలి
- మావోయిస్టులను పిలిచి చర్చలు జరపాలి
- ఎల్కతుర్తి రజతోత్సవ బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- కాంగ్రెస్, బీజేపీపై కేసీఆర్ ఫైర్
- సభ ఆరంభంలో మౌనం పాటించి పహల్గాం మృతులకు నివాళి
- గులాబీ శ్రేణుల్లో నయా జోష్

అక్షరదర్బార్, వరంగల్: తెలంగాణను పదేండ్లు అభివృద్ధిపథంలో నడిపాం.. తెలంగాణ కోసమే గులాబీ జెండా పుట్టిందని, త్యాగాల పునాదులపైనే స్వరాష్ట్రం కల సాకారమైందని కేసీఆర్ అన్నారు. 1969లో మూగబోయిన తెలంగాణవాదానికి మళ్లీ జీవం పోశామన్నారు. వలసవాదుల విష కౌగిలిలో నలిగిపోయిన తెలంగాణకు విముక్తి కల్పించామన్నారు. ఆనాడైనా.. ఈనాడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. తెలంగాణ బిడ్డలను కాల్చి చంపింది.. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది కాంగ్రెస్ అన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే నిరంకుశంగా అణిచివేసిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమ ఉధృతమైందన్నారు. తెలంగాణ ఇస్తామని ప్రకటన చేసే ఆంధ్రలో వ్యతిరేకత రాగానే మళ్లీ వెనక్కు తగ్గిందన్నారు. సాగరహారం, వంటావార్పు, సకల జనుల సమ్మె.. వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉధృతం చేశామన్నారు. సాధించుకున్న తెలంగాణలో ప్రజలు దీవించి పదేళ్లపాటు అవకాశం ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడో ఉన్న తెలంగాణను అభివృద్ధి పదంలో నడిపామని, పడావు పడ్డ భూముల్లో ధాన్యపు రాశులు పండించామని కేసీఆర్ అన్నారు. సభ నిర్వహణలో కీలకపాత్ర పోషించిన పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, తక్కెళ్ళ పల్లి రవీందర్ రావులకు, సభ నిర్వాహణకు భూములు ఇచ్చి సహకరించిన రైతులకు నా.. ప్రత్యేక ధన్యవాదాలని కేసీఆర్ అన్నారు.

## ఓరుగల్లు గులాబీమయం..

ఓరుగల్లు గులాబీమయమైంది. బీఆర్ఎస్ రజతోత్సవ సభ జన జాతరను తలపించింది. ఊరువాడా ఉద్యమస్ఫూర్తితో ఎల్కతుర్తి బాటపట్టింది. రాష్ట్రం నలుదిక్కుల నుంచి లక్షలాదిగా ప్రజలు ఇంటి పండుగలా భావించి వెల్లువలా తరలివచ్చారు. ఎడ్లబండ్లు, ప్రభలు, సైకిళ్లు, కార్ల ర్యాలీలతో నాయకులు, కార్యకర్తలు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఐదు రోజుల కిందట సూర్యాపేట నుంచి బయలుదేరిన ఎడ్లబండ్ల ర్యాలీ, పరకాల, నర్సంపేట నియోజకవర్గాల నుంచి ప్రభలతో నాయకులు తరలివచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి గులాబీ రంగు కార్లతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ర్యాలీ సభకు వచ్చింది. ఇక తెలంగాణ ఆటపాటలతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. కళాకారుల ఆటపాటలకు సభికులు డ్యాన్సులు చేస్తూ సంబురాల్లో మునిగిపోయారు. లక్షలాదిగా తరలిచ్చిన ప్రజల కోసం నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఎండల తీవ్రత ఎక్కువ ఉండడంతో 10 లక్షల వాటర్ బాటిళ్లు, 16 లక్షల మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఇక గులాబీ బాస్ కేసీఆర్ స్పీచ్ వినడానికి పార్కింగ్ ప్రాంతాలతో పాటు 23 చోట్ల భారీ ఎల్ఈడీ తెరలను అమర్చారు. మహిళలు, దివ్యాంగులు, ముఖ్య నేతలకు ప్రత్యేక గ్యాలరీలను సమకూర్చారు. ఉద్యమ నేత ప్రసంగాన్ని కోట్లాది మంది టీవీల్లో ఆసక్తిగా గమనించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు 1100 మందికిపైగా పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.





## మావోయిస్టులతో చర్చలు జరపాలి

### ఆపరేషన్ కగార్ వెంటనే ఆపాలి

కేంద్రానికి పార్టీ నుంచి లేఖ రాయాలని రజతోత్సవ సభ తీర్మానం

చెప్పిన మాటలన్నీ ఏమాయే.. ఇచ్చిన హామీలు ఎక్కడపోయే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయ్యే.. ఏం రోగం పుట్టింది.. దుఖంతో మాట్లాడుతున్న.. ముందుకు పోవాల్సిన తెలంగాణ ఇయ్యాల వెనక్కిపోతోంది. హైదరాబాద్ యూనివర్సిటీ భూములు అమ్ముతున్నరు.. రేపు ఉస్మానియా యూనివర్సిటీని అమ్ముతరు.. రాష్టంలో భూముల రేట్లు పడిపోయినయ్. ఇయ్యాల తెలంగాణలో కరెంట్ పోయింది.. రియల్ ఎస్టేట్ పన్నది.. అన్ని రంగాలు దెబ్బ తిన్నయ్.. రాష్ట్రం నడపడం చాతకాక అడ్డంపాడుగు మాట్లాడుతున్నరు.. అంటూ కాంగ్రెస్ నేతలపై కేసీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అన్నింట్లో ఫెయిలైన కాంగ్రెస్ దేంట్లో పాస్ కాలేదన్నారు. సంచులు నింపుడు.. సంచులు మోసుడులో మాత్రం ముందు ఉందని మండిపడ్డారు. 20 శాతం, 30 శాతం కమిషన్లతో మాత్రం పాస్ అయిందని ఘాటుగా విమర్శించారు. పోడగొట్టుకున్న కాన్నే దొరకబట్టాలే.. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఎవరూ ఆపలేరని కేసీఆర్ అన్నారు. బీజేపీపైనా కేసీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని, నక్సలైట్లను చర్చలకు పిలవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'తెలంగాణలో బ్రహ్మాండంగా పెండింగ్ కూడా కంప్లీట్ చేసుకున్నాం.. కల్వకుర్తి కావచ్చు.. ఎల్లంపల్లి కావచ్చు.. కాళేశ్వరం కావచ్చు.. మూడున్నర లక్షల టన్నుల వడ్లు వండించే స్థాయికి తెలంగాణను తీసుకొని పోయినం. వరంగల్ గడ్డ కోసం ఇదే జిల్లా కోసం పెండింగ్లో ఉన్న దేవాదుల కంప్లీట్ చేసి ఈ గడ్డకు నీళ్లు తెచ్చుకున్నాం. మూడేళ్లలో కాలేశ్వరం ప్రాజెక్టు కట్టుకున్నాం. వాగుల మీద వంకల మీద చెక్ డాములు కట్టుకున్నాం. మిషన్ కాకతీయ పేరు మీద చెరువులన్నీ పూడికలు తీసుకున్నాం. ఒక అద్భుతమైన తెలంగాణను తయారు చేసుకున్నాం. కానీ నేడు పరిస్థితి భిన్నంగా మారింది.'



# తెలంగాణ కొత్త సీఎస్ రామకృష్ణారావు

- 1991 బ్యాచ్ ఐఏఎస్‌కు కీలక పదవి
- ఈనెల 30న ప్రస్తుత సీఎస్ శాంతికుమారి పదవి విరమణ
- రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీ

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె. రామకృష్ణారావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన, ప్రస్తుతం ఆర్థికశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు. ఈనెల 30న ప్రస్తుత సీఎస్ శాంతికుమారి పదవి విరమణ చేయనున్నారు. రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీ అయ్యారు. గుడ్ గవర్నెన్స్ వైస్ ఛైర్మన్‌గా శశాంక్ గోయల్, ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవోగా జయేశ్ రంజన్, పరిశ్రమలు, వాణిజ్యం ప్రత్యేక ముఖ్యకార్యదర్శిగా సంజయ్ కుమార్, ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా స్మితాసభర్వాల్, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా దానకిశోర్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్‌ఎండీఏ వెలుపల)- టీకే శ్రీదేవి, పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి( హెచ్‌ఎండీఏ పరిధి)- ఇలంబర్తి, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్, ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్‌గా కె. శశాంక, జెన్‌కో సీఎండీగా ఎస్.హరీశ్, రాష్ట్ర మానవహక్కుల కమిషన్ సెక్రటరీ, సీఈవోగా నిఖిల, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ సంగీత సత్యనారాయణ, దేవాదాయశాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట ఈవోగా ఎస్. వెంకటరావు నియమితులయ్యారు.



